సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 10 । మార్చి । 2023



వైభవంగా పుష్పయాగం

తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. -8లో..



జగనన్న లేఅవుట్లలో ప్రతి ఇంటికీ కొళాయి

జగనన్న లేఅవుట్లలోని ప్రతి ఇంటికీ నీటికొళాయి కనెక్షన్ ఇవ్వాలని హౌసింగ్ ఈడీ ఎన్.రామచంద్రారెడ్డి తెలిపారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 151 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	170	585
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 433.84 కిలోలు

న్యూస్‌రీల్

వెబ్‌కాస్టింగ్‌లో పొరపాట్లకు తావివ్వరాదు

రాయచోటి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మీ నోడల్ అధికారి(వెబ్ కాస్టింగ్) ఇంజనీరింగ్ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెబ్ కాస్టింగ్ ప్రక్రియపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందని, పోలింగ్ పూర్తయ్యే వరకు పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ ద్వారా లైవ్ కాస్టింగ్‌ను ఎలాంటి అంతరాయం కలగకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సాయి ఇంజనీరింగ్ కళాశాల సహాయక డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారిక యంత్రాంగం ఏర్పాట్లుచేసింది. ఇందుకు గాను కలెక్టరేట్‌లో జేసీ, డీఆర్వో చాంబర్లలో ప్రత్యేక సీల్డ్ బాక్సులను ఏర్పాటుచేశారు. ఓటు హక్కు ఉన్న సిబ్బంది, అధికారులు తమ ఓటు అందులో వేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఇదే విధంగా తిరుపతి, అన్నమయ్య, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కలెక్టరేట్లలో పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేశారు.

వీఓఏల అధ్యక్షుడిగా జయరాం

రామాపురం: అన్నమయ్య జిల్లా వెలుగు కార్యనిర్వాహక సహాయక సంఘం (వీఓఏ) అధ్యక్షుడిగా రామాపురం మండలం గువ్వలచెరువు గ్రామానికి చెందిన జయరాం ఎన్నికయ్యారు. గురువారం రాయచోటిలో కార్యవర్గ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా లక్ష్మీ సుజాత, కోశాధికారిగా గంగాదేవి, ఉప కార్యదర్శిగా చంద్రకళ, సలహాదారులుగా ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ వీఓఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జయరాం తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కలికిరి: ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. అన్నమయ్య జిల్లాలో బాలికలకు కలికిరి, పీలేరు, నందలూరు పాఠశాలల్లో 80 సీట్లు వంతున, బాలురకు తంబళ్లపల్లి(అంగళ్లు) పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు http:// mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌లో చూడ వచ్చన్నారు. ఏప్రిల్ 04వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

వెటరన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో గురువారం పి.ధనుంజయరెడ్డి మెమోరియల్ వెటరన్స్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ పోటీలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెటరన్ క్రికెట్ ఆడుతుండటం ద్వారా ఫిట్‌నెస్ మెయిన్‌టెన్స్‌తో పాటు పాతతరం, కొత్త క్రికెటర్ల మధ్య చక్కటి అనుబంధానికి దారి తీస్తుందన్నారు. తదుపరి వెటరన్ క్రికెట్ మ్యాచ్‌లు మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు ధనంజయరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతపురం విజయం..

ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. జట్టులోని రాజాకృష్ణ 79 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు గులాం 2, ఇనాయతుల్లా 2, షాబుద్దీన్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన అనంత జట్టు 17.5 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. దీంతో అనంతపురం జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.

హైదరాబాద్ జట్టు గెలుపు

మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు 18.1 ఓవర్లలో 104 పరుగులు చేసింది. జట్టులోని శ్రీకాంత్‌రెడ్డి 38, ఖదీర్‌బాబా 24 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 14.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. హైదరాబాద్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కౌంట్‌డౌన్!

- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు మూడు రోజులే గడువు
- ప్రచారంలో దూసుకు పోతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు
- పోలింగ్ ఏర్పాట్లలో ఎన్నికల అధికారులు



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా, జేసీ తమీమ్ అన్సారియా తదితరులు

సాక్షి రాయచోటి: శాసనమండలి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి కౌంట్‌డౌన్ మొదలైంది. పోలింగ్‌కు గడువు మూడురోజులే ఉండడంతో పార్టీలు ఏజెంట్లు, ఇతర వ్యవహారాలపై దృష్టి సారించగా, అధికారులు పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పట్టభద్రులతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రచారం రేపటితో ముగియనుంది. ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో ముందు వరుసలో ఉన్నారు. మిగతా అభ్యర్థులు ప్రచారంలో ఉన్నప్పటికీ వారికి ప్రజల నుంచి అంతంత మాత్రంగా స్పందన లభిస్తోంది.

11న ముగియనున్న ప్రచారం

శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఈనెల 11వ తేదీ సాయంత్రానికి ప్రచార గడువు ముగియనుంది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు అభ్యర్థులు ఎవరికి వారుగా ప్రచారం నిర్వహించుకుంటూ వచ్చారు. పోలింగ్ కూడా గడువు సమీపించింది. కేవలం మూడు రోజులే సమయం ఉండడంతో అందరూ హడావుడిగా పనుల్లో నిమగ్నమయ్యారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు సంబంధించి ఎక్కడికక్కడ బూత్‌లలో కూర్చొబెట్టడానికి అవసరమైన ఏజెంట్లను, వారికి సంబంధించి ప్రక్రియను పూర్తి చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

ప్రచారంలో వైఎస్సార్ సీపీ ముందంజ

అన్నమయ్య జిల్లాలో ఎక్కడికక్కడ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. అటు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, ఇటు కర్నూలు, కడప. అనంతపురానికి సంబంధించిన వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచార పర్వాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయ, ఇటు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రచారంలో అందరికంటే ముందున్నారు. ఎక్కడికక్కడ వైఎస్సార్ సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు అడుగుతూ వస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గెలుపుకు అవసరమైన వ్యూహాలను రూపొందించుకుంటూ అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో అధికారులు పోలింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ప్రధానంగా బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడం, బారికేడ్లు, ఇతరత్రా పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా కిందిస్థాయి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తూ పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 44 , ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు.

పోలింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం. పోలింగ్‌కు సంబంధించి మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ఎక్కడికక్కడ అన్ని చర్యలు చేపడుతున్నాం. బ్యాలెట్ బాక్సులు కేంద్రాలకు చేరవేయడం మొదలుకొన్ని సిబ్బంది నియామకం ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే పరిశీలించాం. అర్హతగల వారు ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

పటిష్ట బందోబస్తు



శాసనమండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పోలింగ్ బూత్‌ల వారీగా విభజించి హైపర్ సెన్సిటీవ్, సెన్సిటివ్, సాధారణ పోలింగ్ కేంద్రాల ప్రక్రియ పూర్తి చేశాం. అందుకు అనుగుణంగా ఎక్కడికక్కడ బందోబస్తు చర్యలు చేపడుతున్నాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పోలీసుశాఖ చర్యలు చేపట్టింది.

– హర్షవర్ధన్‌రాజు, జిల్లా ఎస్పీ, రాయచోటి, అన్నమయ్య

పకడ్బందీగా బ్యాలెట్ బాక్సుల తరలింపు

అధికారులకు జిల్లా కలెక్టర్ గిరీషా ఆదేశం

రాయచోటి : మార్చి 13వ తేదీన జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సుల తరలింపు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్నమయ్య జిల్లాలో 16 రూట్లు ఉన్నాయన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు, జంబో బాక్సులకు పోలింగ్ ఏజెంట్ సమక్షంలో జాగ్రత్తగా సీల్ వేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు ఓపెన్, క్లోజ్ చేయడంపై పోలింగ్ అధికారులు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు జంబో బాక్సులు ట్రాన్స్‌పోర్టేషన్ గురించి సంబంధిత అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు సద్వినియోగానికి అవకాశం ఇవ్వాలి

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియ జరుగనుందని, ప్రైవేట్ సంస్థల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటుహక్కు కలిగి ఉన్న ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 13.03.2023న పనిచేసే వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, ఇతర అన్ని ప్రైవేట్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, ఓటర్లుగా నమోదైన వారు ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోల్ రోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆ రోజు పర్మిషన్, డ్యూటీకి ఆలస్యంగా హాజరుకావడానికి అనుమతి, డ్యూటీ గంటలు తక్కువకు కుదించడం, షిఫ్ట్ పద్ధతిలో అవకాశం ఇవ్వాలని పలు ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలను కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించండి

రాయచోటి: చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో జిల్లా కలెక్ట సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం గోడపత్రికలను, కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ శేషగిరిబాబు, ఎన్‌డీడీ కార్యక్రమ జిల్లా సమన్వయకర్త ఇంతియాజ్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ డిప్యూటీ డైరెక్టర్ సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డీడీ జాకీర్‌హుస్సేన్, జిల్లా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా, తదితరులు

సీసీ కెమెరాల నిఘాతో ఇంటర్ పరీక్షలు

- ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహణ
- అన్ని ఏర్పాట్లు పూర్తి: డీఐఈఓ కృష్ణయ్య



రాయచోటి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య తెలిపారు. గురువారం రాయచోటిలోని డీఐఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూలు నిర్వహణ వివరాలను మీడియాకు వివరించారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశానుసారం విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు చేపట్టామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఇంటర్ బోర్డు అధికారులు ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లాలో 52 పరీక్షా కేంద్రాల్లో 28,380 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నుంచి 13,934 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 14,446 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ఉత్తీర్ణతలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు తగు చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లాలో 31 ప్రశ్నాపత్రాల స్టోరేజ్ పాయింట్లు ఉండగా, నాలుగు ఫ్లెయింగ్ స్క్వాడ్, పది సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోవాలన్నారు. పరీక్షాకేంద్రానికి సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులతో మాట్లాడతామన్నారు.

విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి రావాలి....

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందే రావాలని డీఐఈఓ సూచించారు. సమయం దాటివస్తే ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించమన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలకు సంబంధించిన వివరాలను ఒక రోజు ముందుగానే చూసుకోవాలని, అనవసరమైన ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దన్నారు. ఎల్క్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని తెలిపారు.

రాములోరి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి, చిత్రంలో వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కోదండ రాముడి బ్రహ్మోత్సవాల వివరాలు..

తేదీ	ఉదయం	రాత్రి
మార్చి 31	ధ్వజారోహణం	శేష వాహనం
ఏప్రిల్ 01	వేణుగానాలంకారం	హంస వాహనం
2న	వటపత్రసాయి అలంకారం	సింహ వాహనం
3న	నవనీత కృష్ణాలంకారం	హనుమత్సేవ
4న	మోహినీ అలంకారం	గరుడ సేవ
5న	శివధనుర్బాణాలంకారం	గజ వాహనం
6న	రథోత్సవం	-------
7న	కాళీయమర్ధన అలంకారం	అశ్వ వాహనం
8న	చక్రస్నానం	ధ్వజావరోహణం
9న	సాధారణ కార్యక్రమాలు	పుష్పయాగం, ఏకాంతసేవ

ఒంటిమిట్ట: టీటీడీలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టిగా కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్ట రామయ్య బ్రహ్మోత్సవాలపై వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్‌తో టీటీడీ ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించాలన్నారు. టీటీడీ అధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ..బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఇందులో భాగంగా భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు, హెల్ప్ డెస్క్‌లు, సైన్ బోర్డులు, పారిశుధ్య, పబ్లిక్ అడ్రస్ సిస్టం విభాగాలు ఈ నెల 16వ తేదిలోగా తమ కార్యచరణ ప్రణాళికలను అందించాలన్నారు. అంతకుముందు టీటీడీ ఈవో ధర్మారెడ్డి, కలెక్టర్ విజయరామరాజుతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. జేఈవో వీరబ్రహ్మం రామయ్య కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, టీటీడీ సీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గూడుకు భరోసా

- గృహ నిర్మాణాలకు ప్రభుత్వం రూ.1.80 లక్షల అందజేత
- అదనంగా వైఎస్సార్‌క్రాంతిపథం నుంచి ఒక్కో ఇంటికి రూ.35వేలు
- జిల్లాలో రూ.159.07 కోట్ల రుణాలు పంపిణీ



మదనపల్లె పట్టణంలో ఇళ్ల నిర్మాణాలు

బి.కొత్తకోట: పేదలకు మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వైఎస్సార్-జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించిన ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు సహకారం అందిస్తోంది. ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.1.80లక్షల సాయం అందిస్తుండగా లబ్ధిదారులకు అండగా నిలుస్తూ మరింత రుణాలు అందిస్తోంది. ఇప్పటికే వైఎస్సార్ క్రాంతిపథం మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉంటున్న మహిళలు బ్యాంకు లింకేజీ రుణాలు పొందుతున్నారు. వీరికి ఇవే సంఘాల పరిధిలో మళ్లీ అదనపు రుణాలు మంజూరు చేస్తున్నారు. పక్కా గృహాలు మహిళల పేరిట ప్రభుత్వం కేటాయింపు చేసింది. మహిళలకు సంఘాల నుంచి రుణం అందిస్తూ భరోసా కల్పిస్తోంది.

45,455 ఇళ్లకు అదనం

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 77,161 మంది పేదలకు వైఎస్సార్-జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్లు మంజూరు చేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా వారికి అదనంగా నిధులు మంజూరుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో ఒక్కో లబ్ధిదారునికి మహిళా సంఘాలు, బ్యాంకుల ద్వారా రూ.35వేల చొప్పున మంజూరు చేస్తున్నారు. ఈనెల 2వ తేదీ నాటికి జిల్లాలో 45,455 పక్కా గృహాలకు రూ.159.07 కోట్లను రుణంగా అందించారు. రాయచోటి నియోజకవర్గంలో రూ.35.08 కోట్లు, పీలేరు నియోజకవర్గంలో రూ.31.57 కోట్లు, రాజంపేట నియోజకవర్గంలో రూ.22.60 కోట్లు, రైల్వేకోడూరు నియోజకవర్గంలో రూ.13.92 కోట్లు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో రూ.29.41 కోట్లు, మదనపల్లె నియోజకవర్గంలో రూ.26.49 కోట్లు అందించారు.

ఉపాధి ద్వారా పనులు

ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల పనిదినాలు కల్పిస్తున్నారు. రూ.1.80లక్షల యూనిట్ విలువలో రూ.23,130 ఉపాధి పనులు చేయించుకోవడం ద్వారా ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 23 లక్షల పనిదినాలను ఇంటి నిర్మాణాలకు కల్పించాలన్న లక్ష్యం కాగా అందులో 12.20 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. జిల్లాలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో 4.84 లక్షల పనిదినాలు కల్పించి ప్రథమస్థానంలో నిలిచింది. మంజూరైన ఇళ్ల నిర్మాణాలన్నింటికి 90 రోజుల పనిదినాలు కల్పిస్తారు.

ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చిన ఐకేపీ రుణ వివరాలు

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు	వివిధ దశల్లో ఉన్నవి	రుణంపొందిన గృహాలు
రాయచోటి	19,064	13,208	10,023
పీలేరు	12,333	11,161	9,021
రాజంపేట	11,674	10,291	6,458
రైల్వేకోడూరు	7,298	7,135	3,978
తంబళ్లపల్లె	12,552	11,584	8,404
మదనపల్లె	14,240	9,076	7,571

నిరంతరంగా రుణాలు



వైఎస్సార్-జగనన్న కాలనీల్లో పేద మహిళలు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలకు రూ.35వేలు మంజూరు నిరంతర ప్రక్రియ. ఇప్పటికే మంజూరైన ఇళ్లకు రుణాలు అందిస్తున్నాం. కొత్తగా మంజూరైన ఇళ్లకు కూడా మంజూరు చేస్తాం. కొన్ని సంఘాల నుంచి మహిళలు అధిక రుణాలు తీసుకుంటున్నారు. వీటిని వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

–సత్యనారాయణ, డీఆర్‌డీఏ జిల్లా అధికారి, రాయచోటి

రూ.లక్ష రుణం పొందా..



కురబలకోట మండలం బ్రాహ్మణఒడ్డిపల్లె వద్ద వైఎస్సార్-జగనన్న కాలనీలో ఇంటిస్థలం కేటాయించారు. ప్రభుత్వం అందించే రూ.1.80లక్షలకు తోడు ఇంటి నిర్మాణం కోసం అదనంగా మహిళా గ్రామసమాఖ్య నుంచి రూ.లక్ష రుణం పొందాను. ప్రభుత్వ సహాయం, రుణం కలిపి ఇంటి నిర్మాణం చేసుకుంటున్నాను.

–ఎ.అనురాధ, అంగళ్లు, కురబలకోట మండలం

అగ్రగామి వర్సిటీగా వైవీయూ

- వీసీ ఆచార్య జింకా రంగ జనార్దన



వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం(వైవీయూ) 17వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం వైవీయూలోని ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన జ్యోతి ప్రజ్వలన చేసి వర్సిటీ ఉద్దీపన గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన మాట్లాడుతూ నాణ్యమైన బోధన, పరిశోధన, పరిపాలనతో వైవీయూ త్వరలోనే దేశంలోనే అగ్రగామి విశ్వవిద్యాలయంగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

- ప్రపంచ పోటీ తట్టుకునేలా జ్ఞానసముపార్జన చేయా లని గాదంకి అట్మాస్ఫియర్ రీసెర్చ్ ల్యాబొరేటరీ, స్పేస్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అమిత్‌కుమార్ పాత్ర సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నతవిద్యను అందించాలనే ఆశయంతో వర్సిటీని ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 10వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవాలన్నది ఆయన ఆకాంక్ష అన్నారు.వైవీయూ ప్రిన్సిపాల్ కె.కృష్ణారెడ్డి విశ్వవిద్యాలయం ప్రగతి నివేదికను చదివి వినిపించారు.

ఆటో, బైక్ ఢీ - ఒకరికి గాయాలు


గాయపడ్డ రెడ్డప్పను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

గాలివీడు : ఆటో, బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఇడగొట్టు రెడ్డప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. గాలివీడు గ్రామం, గంగబోయిన వడ్డపల్లెకు చెందిన రెడ్డప్ప ద్విచక్ర వాహనంపై గాలివీడుకు వస్తుండగా మార్గమధ్యంలో ఆటో ఢీ కొనడంతో రెడ్డప్పకు కాలు విరిగినట్లు సమాచారం. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో పైలెట్లు రామాంజులు, ఖాదర్ బాష సహాయంతో హుటాహుటిన బాధితున్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి


మణికంఠనాయుడు (ఫైల్)

రామసముద్రం : ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన నారేవారిపల్లెలో చోటు చేసుకుంది. మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ నారేవారిపల్లె గ్రామంలో కాపురమున్న నారేవారి వసంతకుమార్ కుమారుడు మణికంఠనాయుడు అతడి ఇంటిలోనికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటుషాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వసంతకుమార్‌కు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కాగా.. ఈ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో టైలర్ ఆత్మహత్య


జయరాజ్ (ఫైల్)

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులతో టైలర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో గురువారం జరిగింది. పోతబోలు పంచాయతీ తురకపల్లెకు చెందిన దేవదానం కుమారుడు కె.జయరాజ్ (45) టైలర్ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణం, కుమార్తె వివాహానికి పలువురి వద్ద రూ.3 లక్షలకు పైగా అప్పులు చేశాడు. ఈ క్రమంలో రుణదాతల ఒత్తిడి ఎక్కువ కావడంతో అప్పులు చెల్లించలేక, జీవితంపై విరక్తి చెంది ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఏడు సంవత్సరాల క్రితం జయరాజ్ భార్య పుష్పా ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. జయరాజ్ కుమారుడు సునీల్ ఇంటర్మీడియట్ చదువుతుండగా కుమార్తెలు సుమిత్ర, అనుషా ఉన్నారు. ఇటీవల పెద్ద కుమార్తె సుమిత్రకు వివాహం చేశారు. వివాహ ఖర్చుల నిమిత్తం అప్పులు చేశాడు. అయితే గత నాలుగు సంవత్సరాల నుంచి భార్య డబ్బులు పంపకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో అప్పులు చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరి గుడిసె దగ్ధం

సంబేపల్లె : మండలంలోని చెరువుముందర కొత్తపల్లెకు చెందిన శిబ్యాల అలివేలమ్మ అనే మహిళ పూరిళ్లు గురువారం దగ్ధమైంది. గురువారం ఆమె కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఒక్కసారిగా పూరింటికి నిప్పంటుకుని కాలిపోయింది.

వైభవంగా పుష్పయాగం


ఆలయంలో స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఉదయాన్నే స్వామివార్లకు తోమాలసేవ నిర్వహించారు. పవిత్ర జలాలతో స్నపన తిరుమంజనం కన్నులపండుగగా నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు వాహనమండపంలో తిరుచ్చి అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి రంగురంగుల పుష్పాలను పెద్ద ఎత్తున తెప్పించి గ్రామోత్సవం నిర్వహించారు. వాటితో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో ప్రతి ఇంటికీ కొళాయి

హౌసింగ్ ఈడీ రామచంద్రారెడ్డి


గృహ నిర్మాణాలపై సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఈడీ రామచంద్రారెడ్డి

మదనపల్లె : రాష్ట్రప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్మాణం జరుపుకుంటున్న జగనన్న లేఅవుట్లలోని ప్రతి ఇంటికీ నీటికొళాయి కనెక్షన్ ఇవ్వాలని హౌసింగ్ ఈడీ ఎస్.రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మదనపల్లె మండలంలోని లాభాల గంగమ్మ గుడి లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. జరుగుతున్న నిర్మాణపనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. లే అవుట్‌లో లబ్ధిదారులకు కల్పించాల్సిన నీరు, కరెంట్, ఇతర మౌలికవసతులపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఈడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక సర్వే ద్వారా ఇళ్లు, స్థలం లేని పేదలను గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా 30లక్షల పైచిలుకు పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ఉగాది పండుగ రోజున వీలైనంత ఎక్కువ సంఖ్యలో గృహప్రవేశాలు జరిపించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో హౌసింగ్ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రామస్వామిరెడ్డి, ఏఈ దీనదయాళ్‌రాజు, సర్పంచ్ దండు కరుణాకర్ రెడ్డి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని మందపల్లి పంచాయతీలోని మందపల్లి దళితవాడకు చెందిన ఊట్ల చంద్ర అప్పు చేసి 27 గొర్రెలను గూడూరు సంతకు వెళ్లి కొనుగోలు చేశాడు. వాటిని పెంచుకుంటూ వస్తున్నాడు. బుధవారం రాత్రి మేపునకు తీసుకెళ్లిన గొర్రెలను తన జీవాల దొడ్డిలో యథావిధిగా ఉంచి నిద్రకు ఉపక్రమించాడు. అయితే తెల్లవారే సరికి కుక్కల దాడిలో 9 పెద్దవి, 6 చిన్నవి గొర్రెలు మృతి చెందాయి. 3 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో దాదాపు రూ.2.50 లక్షలు నష్ట పోయినట్లు చంద్ర తెలియజేశారు. ఇదే విషయం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి, ఆయన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి విలపించాడు. ఆకేపాటి ఆదేశాల మేరకు పశుసంవర్ధకశాఖ ఏడీ కే ప్రతాప్ , పశువైద్యాధికారి కే భాగ్యవతి, ఎంపీవీసీ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జూనియర్ వెటర్నటీ ఆఫీసర్ వరదయ్య, ఆర్‌బీకే ఇంచార్జి రాజేంద్రప్రసాద్ తదితరులతో కలసి ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డికి సమాచారం ఇచ్చి ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

యువగళం సాక్షిగా తమ్ముళ్ల తగాదా


యువగళం పాదయాత్రలో గొడవ పడుతున్న ఇరువర్గాలవారికి సర్దిచెబుతున్న నారా లోకేష్

మదనపల్లె : యువగళం పాదయాత్ర నారాలోకేష్‌కు నాయకుడిగా గుర్తింపు తెచ్చే మాటేమో కానీ... మదనపల్లె నియోజకవర్గానికి చెందిన ఇద్దరు నాయకుల మధ్య తగాదా పెట్టింది. చినబాబు దృష్టిలో నేను మాత్రమే నాయకుడిగా మార్కులు కొట్టేయాలనుకునే ఆతృత కాస్తా ఇద్దరి మధ్య గొడవకు కారణమై, నారాలోకేష్ సర్దిచెప్పినా మంట చల్లారక చివరకు ఓ నాయకుడు పాదయాత్ర నుంచి అలిగి వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడింది. మదనపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టీడీపీ టికెట్ ఆశావహుడు జయరామనాయుడు ఇరువురూ యువగళం పాదయాత్ర మదనపల్లె నియోజకవర్గంలో అడుగుపెడుతున్న సందర్భంగా నారాలోకేష్‌కు స్వాగతం చెప్పేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో జయరామనాయుడు తన అనుచరులతో నారాలోకేష్‌ను స్వాగతిస్తుండగా, మధ్యలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటిరమేష్ రోప్‌వేలో దూరారు. దీంతో తాము ఆహ్వానం పలుకుతుంటే నీవు మధ్యలో రావడమేంటని జయరామనాయుడు, తాను ఇన్‌చార్జ్‌నంటూ రమేష్ ఇద్దరూ లోకేష్ ఎదుటే వాగ్వాదానికి దిగారు. ఇది తీవ్రమవడంతో నారాలోకేష్ జోక్యం చేసుకుని కార్యకర్తలను వారించి ఇద్దరికి సర్దిచెప్పి చల్లబరచారు. వివాదం సద్దుమణిగిందనుకునేలోపు మరుసటిరోజైన గురువారం ఉదయం జయరామనాయుడు నారాలోకేష్‌కు 500 కిలోల ఆపిల్స్‌తో గజమాల క్రేన్‌తో వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుని క్యాంప్‌సైట్ పూలవాండ్లపల్లెకు చేరుకున్నాడు. నారాలోకేష్ పాదయాత్ర ప్రారంభంలోనే వేయాలని భావించి సిద్ధం చేసుకుంటుండగా దొమ్మలపాటి రమేష్ దీనికి అంగీకరించలేదు. దండ వేసేందుకు ససేమిరా కుదరదంటూ నారాలోకేష్‌కు కరాఖండిగా చెప్పేశారు. దీంతో ఆయన మదనపల్లె దగ్గర వేయవచ్చని జయరామనాయుడుకు సర్దిచెప్పి ఆయనను పాదయాత్రలో రావాల్సిందిగా కోరారు. లోకేష్ మాట ప్రకారం జయరామనాయుడు పాదయాత్రలో నడుస్తుండగా, రమేష్ వర్గీయులు కావాలనే జయరామనాయుడును గిల్లడం, కాలితో తొక్కడం, గోలగోల చేయడంలాంటి చేష్టలతో ఇబ్బందులు పెట్టసాగారు. దీన్ని లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో చివరకు అలిగిన ఆయన ఏకంగా పాదయాత్ర నుంచి ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో జయరామనాయుడు వర్గీయులు యువగళం పాదయాత్రలో తమ నాయకుడికి జరిగిన అవమానంపై రగిలిపోతున్నారు.

ఆహ్వానించి...అవమానపరచడమెందుకు?

- నారా లోకేష్ తీరుపై పాల ఏకరుల ఆగ్రహం
- వినతికే పరిమితం చేయడాన్ని ఖండించిన సంఘ నాయకులు

మదనపల్లె : యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌తో గంటసేపు సమావేశం ఉంటుందని పత్రికాప్రకటనలు ఇచ్చి కులస్తులందరినీ ఆహ్వానించి, కేవలం అర్జీ తీసుకుని అవమానపరచడంపై పాల ఏకరి కులస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మదనపల్లెలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాల ఏకరి సంఘ నాయకులు జన్నే శేషాచలపతి నాయుడు మాట్లాడుతూ నారాలోకేష్ పాదయాత్ర ప్రారంభం సందర్భంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు పాల ఏకరులతో సమీక్షా సమావేశం ఉంటుందని, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి అందరినీ రావాల్సిందిగా పిలుపునిచ్చారన్నారు. దీంతో టీడీపీ నాయకుల మాటలను నమ్మి సమీక్షా సమావేశానికి వెళ్లినవారిని అక్కడివారు పట్టించుకోలేదని, అంతేకాకుండా కేవలం అర్జీకు పరిమితం చేసి సెల్ఫీ తీసుకుని పంపేశారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తమను ఓటుబ్యాంకుగా వాడుకుని చిన్నచూపు చూడటం తప్ప తమ కులానికి చేసిన మేలు లేదన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో పాల ఏకరి కులాన్ని బీసీ జాబితాలో చేర్చడం వల్ల నేడు ఎందరో తమ కులస్తులు డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. యువగళం పాదయాత్రలో ఇతర కులాలకు చెందిన వ్యక్తులతో సమయాన్ని వెచ్చించి, పాల ఏకరి కులాన్ని నిర్లక్ష్యం చేయడంపై నారాలోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాల ఏకరి నాయకులు జన్నే సుబ్బయ్యనాయుడు, మాజీ ఎంపీటీసీ మల్లికార్జుననాయుడు, వెంకటస్వామినాయుడు, కౌన్సిలర్ సుగుణ, ఆంజనేయులు, నాగార్జున, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

- ఏపీడీలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి
- గుర్రంకొండలో సామాజిక తనిఖీ బహిరంగసభ
- ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ


సామాజిక తనిఖీ బహిరంగ సభలో విచారణ నివేదికలను తెలియజేస్తున్న అధికారులు

గుర్రంకొండ : ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పనితీరు మార్చుకోవాలని రాయచోటి, రాజంపేట ఏపీడీలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. గురువారం గుర్రంకొండలోని ఉపాధి కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగసభ నిర్వహించారు. ఈసదర్భంగా వారు మాట్లాడుతూ 2022–23 ఏడాదికి గానూ మండల పరిధిలో రూ. 7.17 కోట్ల మేర ఉపాధి పనులు జరిగాయన్నారు. సామాజిక తనిఖీ బృందం విచారణలో రూ.62,058 దుర్వినియోగం అయినట్లు తేలిందన్నారు. ఈ సొమ్మును రికవరీ చేసేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉపాధి నిధుల దుర్వినియోగంకు సంబంధించి ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ ప్రకాష్, జిల్లా క్వాలిటికంట్రోల్ అధికారిణి సుశీల, ఎస్‌ఆర్పీ సూర్యచక్ర, ఎంపీడీఓ వెంకటేశులు, ఏపీఓ రెడ్డి జవహర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామి, పీఆర్‌ఏఈ జావీద్ పాల్గొన్నారు

ఏసీబీ వలకు చిక్కిన వీఆర్‌ఓ


ఏసీబీకి పట్టుబడిన వీఆర్‌ఓ రహమత్ ఖాన్

రాయచోటి : రాయచోటి రూరల్ మండలం, మాధవరం వీఆర్‌ఓ రహమత్ ఖాన్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. గురువారం ఉదయం మాధవరం సచివాలయం సమీపంలో మహిళా రైతు నీలావతి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. మాధవరం గ్రామం, కటినేనివారిపల్లెకు చెందిన నీలావతిని కొన్ని నెలలుగా భూమి పాసుబుక్కు ఇవ్వాలంటే డబ్బులు ఇవ్వాలని వేధించడమే కాకుండా కాలయాపన చేయడంపై ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. గురువారం ఉదయం ఏసీబీ అధికారులు చూస్తుండగానే రూ. 5 వేలు డబ్బులు తీసుకోవడంతో అక్కడే ఉన్న పోలీసులు పట్టుకున్నారు. వీఆర్‌ఓపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు కడప ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

కడప నగర వనంలో ట్రెక్కింగ్ ఏర్పాటు చేయాలి


కడప నగర వనంలో అటవీశాఖ అధికారులు

పీసీసీఎఫ్ వై. మధుసూదన్ రెడ్డి

కడప అర్బన్ : కడప నగర వనంలో ప్రజలకు ట్రెక్కింగ్ అందుబాటులోకి తీసుకురావాలని పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) వై. మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన కడపలోని నగర వనం, గువ్వల చెరువు ప్రాంతాలలో పర్యటించారు. కడప నగర వనంలో వాలీబాల్ కోర్టు, షటిల్ బ్యాట్మింటన్ కోర్టులను ప్రారంభించారు. కడప నగర వనంలో ట్రెక్కింగ్ మార్గాన్ని అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ భవనం, పైన ప్రదేశాన్ని ప్రజల కోసం అందమైన హబ్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అనంతరం గువ్వలచెరువు ఘాట్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలో మినీ నగర వనాన్ని ఏర్పాటు చేయాలని, ఏకో టూరిజంను అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ కూడా ట్రెక్కింగ్ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలన్నారు. రోప్‌వే వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కర్నూలు పి. రామకృష్ణ, కడప జిల్లా అటవీ అధికారి పి.వి సందీప్‌రెడ్డి, డీఎఫ్‌ఓలు గురుప్రభాకర్, నాగార్జునరెడ్డి, కడప రేంజ్ ఆఫీసర్ బాల సుబ్రమణ్యం, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


ధ్వజస్తంభ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా రఘునాథరెడ్డి

నందలూరు (రాజంపేట) : నందలూరులో చోళుల కాలం నాటి శ్రీ కామాక్షి సమేత ఉల్లంఘేశ్వరాలయం విగ్రహప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దంపతులు, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదనరెడ్డి, వైసీపల్లె సర్పంచి మేడా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. వీరికి సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వీరి వెంట తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు భూమన శంకర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, నందలూరు నాయకులు అరిగెల నాని, సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాల నాగ సుబ్బయ్య, రాజంపేట ఏరియా హాస్పిటల్ ఉమా, రూరల్ జెఏసీ కన్వీనరు మందరం గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు సౌమ్యనాథున్ని దర్శించుకున్నారు. ఉల్లంఘేశ్వరాలయం అభివృద్ధికి సొంత నిధులు కేటాయించామని ఎమ్మార్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో కడప ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, జడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తంబళ్ల వేణుగోపాల్ రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు లక్ష్మీనరసయ్య, నాగిరెడ్డిపల్లె సర్పంచి జంబు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా నంది విగ్రహం ప్రతిష్ట..

చోళులకాలం నాటి నంది విగ్రహాన్ని గుప్తనిధుల ముఠా తీసుకెళ్లిన నేపథ్యంలో నూతన విగ్రహాన్ని పునః ప్రతిష్టించారు. చోళుల కా లంనాటి ఉల్లంఘేశ్వర స్వామి (శివలింగం), శ్రీకామాక్షి అమ్మవారు, గణపతి, సుబ్రమణ్యంస్వామి, కాలభైరవుడులను యధావిధి గా ఆలయంలో పునఃప్రతిష్టించారు. కాగా మధ్యాహ్నం శ్రీ కామాక్షి సమేత ఉల్లంఘేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు కడప, విశాఖ


గోల్ చేసేందుకు ప్రయత్నిస్తున్న కడప స్ట్రయికర్స్

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీలో విశాఖ, కడప జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. రైల్వే స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో సెమీస్ చేరేందుకు వైఎస్సార్ కడప జట్టు 6–0 గోల్స్ తేడాతో కర్నూల్ జట్టుపై విజయం సాధించింది. జట్టు తరపున అనురాధ మూడు గోల్స్ చేయగా అరుణ రెండు, రామలక్ష్మి ఓ గోల్ చేశారు. సెమీస్ చేరేందుకు చెరో మ్యాచ్ గెలిచిన విశాఖ-చిత్తూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరికి విశాఖ జట్టు 4–3తో విజయం సాధించి సెమీస్‌కు చేరింది. హేమహాసిని మూడు, వరలక్ష్మి ఓ గోల్ చేయగా చిత్తూరు తరపున షహీనా మూడు గోల్స్ చేసింది. కల్యాణి, శృతి, ధరణి ఒక్కో గోల్ చేయడంతో కృష్ణా జట్టు 3–0తో శ్రీకాకుళంపై విజయం సాధించింది. తూర్పుగోదావరి జట్టు 2–0తో విజయనగరం జట్టుపై విజయం సాధించింది. అశ్విని, గాయత్రి చెరో గోల్ చేశారు. ఏపీ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాల జట్లు తలపడుతున్నాయి.